క్లుప్తంగా

సుందరీకరణకు చర్యలు తీసుకోవాలి



పటమట(విజయవాడతూర్పు): నగరాన్ని మరింత సుందరంగా మార్చేందుకు వీఎంసీ తీసుకుంటున్న చర్యలను ముమ్మరం చేయాలని సంబంధిత అధికారులను మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం ఎదురుగా ఉన్న బందరు కాలువ గట్టుపై జరుగుతున్న సుందరీకరణ పనులను ఆయన గురువారం ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగర అందాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టాలని, అందుకు అనువైన ప్రాంతాలను పరిశీలించి తనకు వెంటనే నివేదిక సమర్పించాలని ఆదేశించారు. నగరంలోని అన్ని ప్రాంతాలు సుందరీకరించటమే కాకుండా, ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పిస్తూ, కాలుష్యాన్ని తగ్గించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ పర్యటనలో డెప్యూటీ డైరెక్టర్ హార్టీకల్చర్ రామ్మోహన్, సూపరింటెండింగ్ ఇంజినీర్ (వర్క్స్) పి.సత్యకుమారి, పార్క్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడికి జైలు

విజయవాడలీగల్: బైక్ చోరీ కేసులో నిందితుడిపై నేరం రుజువు కావడంతో ఏడు నెలల 21 రోజుల జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. 2024 జూన్ 20వ తేదీ రాత్రి మొగల్రాజపురంలోని ఓ ఇంటి ముందు పార్కు చేసిన బైక్ చోరీకి గురైంది. బాధితుడు మాచవరం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేశాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు అనుమానంతో బుడమేరు మధ్యకట్ట ఏరియాకు చెందిన కందుల విఘ్నేశ్వరరావు అలియాస్ ఘ్నేష్‌ను పీటీ వారెంటుపై అదుపులోకి తీసుకొని విచారించి, కోర్టులో హాజరుపరచారు. అతనిపై నేరం రుజువు కావడంతో ఏడు నెలల 21 రోజుల జైలుశిక్ష విధిస్తూ ఒకటో అడిషనల్ చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఎం.ఎస్.కరీముల్లా తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరఫున సీనియర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్. ఉమావతి వాదనలు వినిపించారు.

గ్లకోమాను అశ్రద్ధ చేయొద్దు

లబ్బీపేట(విజయవాడతూర్పు): నీటి కాసులు (గ్లకోమా)ను నిర్లక్ష్యం చేస్తే శాశ్వత అంధత్వం ఏర్పడే ప్రమాదం ఉందని జీజీహెచ్ నేత్ర వైద్య విభాగాధిపతి డాక్టర్ పి.ప్రభాకరశాస్త్రి హెచ్చరించారు. ప్రపంచ గ్లకోమా వారోత్సవాలను పురస్కరించుకుని జీజీహెచ్‌లో గురువారం అవగాహన సదస్సు జరిగింది. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రభాకరశాస్త్రి మాట్లాడుతూ.. 40 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ గ్లకోమా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాధి లక్షణాలపై అవగాహన పెంపొందించడం ద్వారా తొలిదశలో గుర్తించి చికిత్స పొందితే శాశ్వత అంధత్వం రాకుండా నివారించొచ్చని పేర్కొన్నారు. ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ ఇ.సత్యనారాయణమూర్తి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.శిరీష పాల్గొన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు

పటమట(విజయవాడతూర్పు): ఈ వేసవిలో నీటి ఎద్దడి లేకుండా నగరంలోని అన్ని ప్రాంతాల్లో బోర్లను పునరుద్ధరించాలని మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన గురువారం కార్పొరేటర్ ఉద్దంటి సునీతతో కలిసి ఒకటో డివిజన్ ప్రాంతంలో మధురానగర్ పప్పుల మిల్ సెంటర్, రైల్వే ట్రాక్ ఏరియా, గుణదల నుంచి రామవరప్పాడు వెళ్లే సర్వీస్ రోడ్, కార్మెల్ నగర్, వీఎంసీ ఎంప్లాయీస్ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానికులు పారిశుద్ధ్య నిర్వహణలోపం, దోమల సమస్యపై ఫిర్యాదు చేశారు. ఈ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. వీఎంసీ ఎంప్లాయీస్ కాలనీ అభివృద్ధి చేయాలని రోడ్లను, స్ట్రీట్ లైట్లను, తదితర మౌలిక వసతులు అన్ని కల్పించి ఆరు నెలల్లో ఆ కాలనీని అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. ఖాళీ స్థలాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరగాలని, వాటి యజమానులకు నోటీసులు జారీ చేసి స్థలాలను పరిశుభ్రంగా ఉంచాలని, దీనిని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు.

ఇలా చేస్తే మన్నేదెలా!

- కొంతకాలం క్రితం ఊర్మిళానగర్ రోడ్డు నిర్మాణం
- ప్రస్తుతం మ్యాన్‌హోల్స్ ఎత్తు పెంపునకు రోడ్డు తవ్వకం



ఊర్మిళానగర్ ప్రధాన రోడ్డులో మ్యాన్‌హోల్స్‌ఎత్తు పెంచేందుకు రోడ్డును తవ్విన దృశ్యం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్నారు.. తర్వాత కొంతకాలానికి మ్యాన్‌హోల్స్ ఎత్తు పెంపు, కేబుల్స్ ఏర్పాటు అంటూ తవ్వేస్తున్నారు. ప్రణాళికా రహితంగా కార్పొరేషన్ పనులు చేస్తుండటంతో రోడ్డు మన్నేదెలా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. దీంతో ప్రజలకు రోడ్డు కష్టాలు తీరక కొత్త కష్టాలు వస్తున్నాయి. ఏదైనా రోడ్డు నిర్మాణ సమయంలో పైపులైన్లు, కేబుల్ వైర్లు, యూజీడీ మరమ్మతులు వంటివి చేసి ఆ తర్వాత పనులు చేస్తే ఎక్కువ కాలం మన్నుతుంది. కానీ రోడ్డు వేసిన తర్వాత పైపులైన్లు, కేబుల్ వైర్లు పనులు చేయడం, యూజీడీ లైన్లకు మరమ్మతులు పేరుతో మళ్లీ తవ్వుతున్నారు. పనులు పూర్తయిన తర్వాత అక్కడ తిరిగి సిమెంట్‌తో తవ్విన భాగాన్ని పూడ్చినా ఆ ప్రాంతంలో మళ్లీ గండ్లు ఏర్పడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. యూజీడీ మ్యాన్‌హోల్స్ వేసిన చోట సిమెంట్ లేచి గ్యాపులు వస్తున్నాయని, వాహనాలు తిరిగి అక్కడ నుంచి రోడ్డు దెబ్బతింటోంది.

ఊర్మిళానగర్ రోడ్డులో..

బైపాస్ రోడ్డు చర్చి సెంటర్ నుంచి కబేళా రోడ్డు వరకు ఊర్మిళా సుబ్బారావు నగర్ రోడ్డును దశాబ్దాల క్రితం నిర్మించారు. ఆ తర్వాత రోడ్డు పూర్తిగా దెబ్బతింది. చాలా కాలం ఆ రహదారిని పట్టించుకున్న వారు లేరు. వాహనచోదకులు పాదచారులు నానా ఇక్కట్లు ఎదుర్కొన్నారు. కనీసం ప్యాచ్ వర్క్‌లకు కూడా నోచుకోలేదు. సమస్యలను గుర్తించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఊర్మిళానగర్ ప్రధాన రహదారికి ఓ వైపు ఔట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మించింది. రూ. 3.50 కోట్ల బీటీ రోడ్డును నిర్మించింది. రోడ్డు నిర్మాణంతో ఊర్మిళానగర్ వాసుల కష్టాలు తీరిపోయాయి. గతేడాది సెప్టెంబర్‌లో వచ్చిన బుడమేరు వరదనీటితో చర్చి సెంటర్ వరకు మునిగిపోయింది. రోడ్డుపై నడుం లోతుపైగా నీరు చేరింది. కొత్తగా నిర్మించిన రోడ్డు కావడం గుంతలు లేకపోవడంతో ప్రజలు అంత లోతు నీటిలోనూ సురక్షితంగా బయటకు రాగలిగారు. ఏడాదిన్నర క్రితమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రోడ్డును నిర్మించింది.

ఇప్పుడు మళ్లీ తవ్వుతున్నారు

తాజాగా ఈ ప్రభుత్వంలో యూజీడీ మ్యాన్‌హోల్స్ ఎత్తు పెంచడానికి కొత్తగా ఏర్పాటైన రోడ్డును తవ్వుతున్నారు. ఇప్పటికే బీటీ రోడ్డును తవ్వి మ్యాన్‌హోల్స్ ఎత్తు పెంచారు. తవ్విన చోట సిమెంట్‌తో కవర్ చేస్తున్నారు. దీనిపై స్థానికులు విమర్శలు చేస్తున్నారు. రోడ్డు సక్రమంగా లేక ఎంతో కాలం ఇబ్బంది పడ్డామని, కొత్త రోడ్డు వేసి కనీసం ఏడాదిన్నర కూడా కాకుండా తవ్వుతున్నారని, తవ్విన చోట తొందరగా రోడ్డు దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాహనాల రాకపోకలు సాగిస్తే మ్యాన్‌హోల్స్ ఎత్తు పెంచిన చోట వేసిన సిమెంట్ తొందరగా కొట్టుకుపోతోందని, ఆ ప్రాంతంలో మళ్లీ రోడ్డు దెబ్బతింటుందని చెబుతున్నారు. పదేళ్లయిన రోడ్డు మన్నేలా చూడాల్సిన అధికారులు ఇలా చేయడమేంటని ప్రశ్నిస్తున్నారు. రోడ్డు నిర్మాణానికి ముందే పైపులైన్ పనులు, కేబుల్ , ఇతర పనులు పూర్తి చేసి ఉంటే రోడ్డు చక్కగా ఉండేదంటున్నారు. మ్యాన్‌హోల్స్ ఎత్తు పెంచే పనులు నాణ్యతతో ఉండేలా చూడాలని కోరుతున్నారు.

ఆరు బయటే పదిలమా!

- ఘాట్‌రోడ్డు, మహా మండపం వద్ద చెప్పుల కుప్పలు
- ఉచితమని చెప్పినా.. వినిపించుకోరే..



చెత్త దంపింగ్ వద్ద కుప్పలుగాచెప్పులు



బారికేట్ల వద్ద చెప్పులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దర్శనానికి విచ్చేసే భక్తులు తమ చెప్పులను కౌంటర్లలో ఉచితంగా భద్రపరుచుకోవచ్చు. దీని కోసం దేవస్థానం ఘాట్‌రోడ్డులోని ఓం టర్నింగ్‌తో పాటు మహా మండపం దిగువన కౌంటర్లను ఏర్పాటు చేసింది. తెల్లవారుజాము నుంచి రాత్రి 9.30 గంటల వరకు ఆయా కౌంటర్లలో సిబ్బంది భక్తులకు సేవ చేస్తుంటారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు తమ చెప్పులను కౌంటర్‌లో భద్రపరుచుకోకుండా ఆరు బయట వదిలేస్తున్నారు. కౌంటర్ కంటే ఆరు బయటే పదిలమని భావిస్తున్నారో ఏమో అర్థం కావడం లేదు. దేవస్థానం మైక్‌లో చెప్పులను ఉచితంగా భద్రపరుచుకోవచ్చని పదే పదే ప్రచారం చేస్తోంది. అయినా సరే దర్శనానికి విచ్చేసే భక్తులు తమ చెప్పులను ద్విచక్ర వాహనాల చక్రాల కింద, ఆలయ ప్రాంగణంలోని బారికేట్ల మధ్యన, షాపుల వద్ద ఇష్టానుసారంగా వదిలి వెళ్లుతున్నారు. ఇలా వదిలి వెళ్లిన చెప్పులు, షూలలో విలువైన వాటిని కొంత మంది దర్జాగా ధరించి వెళ్లిపోతున్నారు. కౌంటర్ల వద్ద , స్టాండ్ల మధ్య మిగిలిపోయిన చెప్పులను శానిటేషన్ సిబ్బంది ఆలయానికి దూరంగా, చెత్త కుప్పల వద్ద పడేస్తున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తులు 10 నిమిషాల పాటు కౌంటర్ వద్ద వేచి ఉండి, చెప్పులను భద్రపరుచుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

విద్యార్థుల సమస్యలపై పోరాడాలి



వానపల్లి రవీంద్రను అభినందిస్తున్న వెలంపల్లి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యారంగ వ్యతిరేక విధానాలపై పోరాడాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఆ పార్టీ విద్యార్థి విభాగం పశ్చిమ నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమితులైన వానపల్లి రవీంద్ర గురువారం వెలంపల్లి శ్రీనివాసరావును ఆయన కార్యాలయంలో కలిశారు. తనకు పదవిని కేటాయించటంపై వెలంపల్లి శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపి సత్కరించారు. ఈ సందర్భంగా వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యారంగ అభ్యున్నతికి అండగా నిలిచిందన్నారు. అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, నాడు–నేడు వంటి అనేక పథకాలను అమలు చేసిందని గుర్తు చేశారు. కానీ నేడు చంద్రబాబు ప్రభుత్వం ఎటువంటి సాయం చేయకపోవటంతో విద్యారంగంలోని విద్యార్థులు తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్నారని చెప్పారు. అనంతరం రవీంద్ర మాట్లాడుతూ విద్యార్థి సమస్యలపై పోరాడతానని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చైతన్యరెడ్డి, దుర్గగుడి మాజీ చైర్మన్ కర్నాటి రాంబాబు, చేనేత విభాగ రాష్ట్ర నేత వానపల్లి త్రిమూర్తులు, బీసీ సంఘ నేతలు మజ్జి శ్రీను, శివ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌ను వదిలి వెళ్లే ప్రసక్తే లేదు

- మా వ్యాపారాలు సజావుగా సాగేలా చూడండి
- రాజీవ్‌గాంధీ హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ వ్యాపారులు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న దుర్గారావు తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాజీవ్ గాంధీ హోల్‌సేల్ మార్కెట్ తమకు అనుకూలమైన ప్రాంతమని, దీనిని వదిలి వెళ్లే ప్రసక్తే లేదని మార్కెట్ వర్తక సంఘం గౌరవాధ్యక్షుడు బత్తుల దుర్గారావు స్పష్టం చేశారు. ఎన్నో సంవత్సరాలుగా వేల మందికి ఉపాధి కల్పిస్తున్న రాజీవ్ గాంధీ హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ వద్ద రైల్వే అధికారులు గడ్డర్లు ఏర్పాటుచేసి వ్యాపారులు, కార్మికులు, రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకుని తమ వ్యాపారాలు సజావుగా సాగేందుకు సహకరించాలని కోరారు.

3 వేల మందికి జీవనాధారం..

మహాత్మాగాంధీ రోడ్డులోని ఓ హోటల్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో బత్తుల దుర్గారావు మాట్లాడారు. అయ్యదేవర కాళేశ్వరరావు మార్కెట్లో హోల్ సేల్ వ్యాపారులు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా విజయవాడ నగరపాలక సంస్థ అధికారులు 40 ఏళ్ల కిందట రాజీవ్ గాంధీ పార్కు సమీపంలో తమకు షాపులు నిర్మించి వ్యాపారం చేసుకునే అవకాశం కల్పించిందని గుర్తుచేశారు. నాటి నుంచి హోల్ సేల్ వ్యాపారం ఆ ప్రాంతం నుంచి కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. రెండేళ్ల నుంచి రైల్వే అధికారులు మార్కెట్‌కు అడ్డంగా గడ్డర్లు ఏర్పాటు చేసి కూరగాయల వాహనాలను లోపలికి రానీయకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. దీంతో వ్యాపారులు, రైతులు, కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. మార్కెట్లో సుమారు 67 షాపులు ఉన్నాయని, 1500 మంది కార్మికులు పనిచేస్తున్నారని, మొత్తంగా మూడు వేల మంది ఈ మార్కెట్ ఆధారంగా జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. రైల్వే అధికారులు గడ్డర్లు ఏర్పాటు చేయడం కారణంగా రోడ్డు పక్కన వాహనాలు నిలిపి అక్కడి నుంచి కార్మికులు కూరగాయలను మార్కెట్లోకి లోపలికి మోసుకురావాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు అల్లు మురళీ, వెన్నం రత్నారావు, ఆకిరి శ్రీను, షేక్ ఖయ్యూం, సుంకర శివాజీ, పైడి వెంకటేశ్వరరావు, బూర్ల రమేష్, శేషు, భూషణం, గుండపు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ తారకప్రసాద్‌కు ఐఎస్ఏ సత్కారం



డాక్టర్ తారకప్రసాద్ దంపతులను సత్కరిస్తున్న ఎనస్థీషియన్స్ అసోసియేషన్ సభ్యులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): మూడు దశాబ్దాల పాటు ఈఎస్ఐలో ఎనస్థీషియన్‌గా సేవలు అందించి ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన డాక్టర్ ఉప్పులేటి తారకప్రసాద్‌ను ఇండియన్ సొసైటీ ఆఫ్ ఎనస్థీషియాలజిస్ట్(ఐఎస్ఏ) నగర శాఖ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సత్కరించారు. గవర్నర్‌పేటలోని ఐఎంఏ హాలులో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఎనస్థీషియన్లు పాల్గొని డాక్టర్ తారకప్రసాద్ సేవలను కొనియాడారు. రోగులకు సేవలు అందించడంతో పాటు, అసోసియేషన్‌లో కూడా పలు కీలక పదవులు అలంకరించి వన్నె తెచ్చారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఐఎస్ఏ నగరశాఖ కార్యదర్శి డాక్టర్ రావెల దివ్య, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కీర్తి, రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యులు డాక్టర్ శ్రీదేవితో పాటు, అసోసియేషన్ పూర్వ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ భీమేశ్వర్, డాక్టర్ గేరా కిరణ్‌కుమార్, డాక్టర్ దుర్గాప్రసాద్, డాక్టర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బిట్ కాయిన్ పేరుతో మోసం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బిట్ కాయిన్ ట్రేడింగ్ చేస్తే మంచి లాభాలు వస్తాయంటూ నమ్మించి మోసం చేసిన వ్యక్తులపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. విద్యాధరపురం నాలుగు స్తంభాల సెంటర్‌కు చెందిన బళ్లా శ్రీనివాస ప్రసాద్ గతంలో వ్యక్తిగత పనిమీద వైజాగ్ వెళ్లాడు. అక్కడ కాంబుత్తుల కృష్ణ సతీష్‌తో పరిచయమైంది. బిట్ కాయిన్ ట్రేడింగ్ చేస్తే లాభాలు వస్తాయని కృష్ణ సతీష్ నమ్మబలికాడు. దీంతో శ్రీనివాసప్రసాద్ రూ.కోటి వరకు పెట్టుబడి పెట్టాడు. ఆ డబ్బుతో బిట్ కాయిన్ ట్రేడింగ్ చేస్తే బాగా లాభాలు వచ్చాయని కృష్ణ సతీష్ చెప్పాడు. అయితే డబ్బులు ఇవ్వకుండా శ్రీనివాస ప్రసాద్‌ను మోసం చేశాడు. తన డబ్బులు ఇప్పించాలని కాకినాడకు చెందిన పులి ప్రతాప్‌ను శ్రీనివాస ప్రసాద్ ఆశ్రయించగా అతను చంద్రశేఖర్ అనే వ్యక్తి వద్దకు తీసుకెళ్లాడు. మూడు నెలల పాటు శ్రీనివాస ప్రసాద్‌ను అతను తన వద్దే ఉంచుకుని డబ్బులు ఇప్పించకుండా తిరిగి పంపించేశారు. దీంతో తాను మోసం పోయాయని తెలుసుకొని భవానీపురం పోలీసుల స్టేషన్‌లో శ్రీనివాసప్రసాద్ ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

మొల్లమాంబ సాహిత్యం అజరామరం



మొల్ల చిత్రపటం వద్ద పూజల్లో డీసీపీ సరిత, సాంబశివరావు, రూపేష్ తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): సంస్కృతంలో వాల్మీకి మహర్షి రచించిన శ్రీమద్రామాయణం ఆధారంగా తేట తెలుగులో ఆతుకూరి మొల్లమాంబ రాసిన పద్యకావ్యం మొల్ల రామాయణం అజరామరమని శాలివాహన సంఘం రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య కొనియాడారు. తెలుగు తొలిమహిళా కవయిత్రి మొల్లమాంబ జయంతి సందర్భంగా విద్యాధరపురం శాలివాహన సంఘం ఆధ్వర్యంలో స్థానిక రామమందిరం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత మొల్ల విగ్రహం ఏర్పాటుకు శంకుస్థాపన చేసిన అనంతరం మొల్ల చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సంప్రదాయ విద్యను అభ్యసించని మొల్ల తన సహజ పాండిత్యంతో అనువదించిన రామాయణ పద్య కావ్యం శైలి చాలా సరళమైనదే కాకుండా రమణీయంగా కూడా ఉంటుందని తెలిపారు. డీసీపీ (అడ్మిన్) సరిత మాట్లాడుతూ రామాయణాన్ని అతి సులువైన పదాలతో రాసి తన సరళమైన పదజాలానికి అందరూ ముగ్ధులయ్యేలా చేసిన కవయిత్రి మొల్ల రామాయణం చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆమె జ్ఞాపకార్థ భారత తపాలా శాఖ 2017లో స్టాంప్‌ను విడుదల చేసిందని గుర్తు చేశారు. బాడిశ సాంబశివరావు, బాడిశ రూపేష్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఐలాపురం రాజా, ఐలాపురం భాస్కర శ్రీనివాస్, శాలివాహన సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు బొమ్మిన శ్రీనివాస్, భర్తవరపు దుర్గాప్రసాద్, నెల్లూరి వీర్రాజు(నాని), కార్పొరేటర్లు గుడివాడ నరేంద్ర రాఘవ, పి.చైతన్యరెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలపై ఆసక్తి పెంచుకోవాలి



నమూనాలను పరిశీలిస్తున్న విద్యార్థులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై ఆసక్తి పెంచుకోవాలని పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శరవణకుమార్ అన్నారు. ఆ కళాశాల భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నగరంలోని గోరా టెక్నో హబ్‌ను విద్యార్థులు, అధ్యాపకులు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంగణంలో ఉన్న వివిధ నమూనాలను పరిశీలించారు. వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. స్పేస్ సైన్స్, రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఊమ్స్ వంటి జన్యుపరమైన అంశాలు, డ్రోన్స్, అంతరిక్ష టెలిస్కోప్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం కంప్యూటింగ్ టెక్నాలజీలతో సహా అనేక అంశాలతో ఏర్పాటు చేసిన నమూనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ శరవణకుమార్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని పెంపొందించేందుకు ఈ విధమైన ప్రదర్శనలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సురేష్, అధ్యాపకులు పి.నరేష్, శ్రీకాంత్‌రెడ్డి, నవీన్‌కుమార్, బిందుమాధవి తదితరులు పాల్గొన్నారు.

ఎంప్లాయీస్ సంఘ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం



మాట్లాడుతున్న పీఆర్ఓ నుస్రత్ మండ్రుప్కర్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని విజయవాడ డివిజనల్ రైల్వే ఆడిటోరియంలో గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విజయవాడ రైల్వే డివిజన్ పబ్లిక్ రిలేషన్స్ అధికారి నుస్రత్ మండ్రుప్కర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా ఉద్యోగులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. మహిళలు హక్కులను తెలుసుకుని, విధులకు కూడా సమ ప్రాధాన్యమిస్తూ రైల్వేల ప్రగతిలో భాగస్వాములు కావాలన్నారు. పలువురు మహిళా ఉద్యోగులను సత్కరించారు. సంఘ్ డివిజనల్ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల రాఘవేంద్ర, ఆమంచి వెంకటేశ్వరరావు, డీఎంఓ డాక్టర్ లీల, డాక్టర్ షాహిదా, సంఘ్ జోనల్ కోఆర్డినేటర్ రాధిక సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

130 గ్రాముల బంగారం చోరీ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఇంటి తాళం పగలగొట్టి బంగారం చోరీ చేసిన ఘటనపై వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో గురువారం ఫిర్యాదు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ముఖేష్‌కుమార్ పురోహిత్ పాతబస్తీ మఠం వీధిలోని మహేంద్ర కాంప్లెక్స్‌లో మన్‌మందిర్ జ్యూయలరీస్ పేరుతో బంగారు ఆభరణాల దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. అతని వద్ద మనీష్‌గోస్వామి, సంజయ్ పని చేస్తున్నారు. గుమస్తాలు ఇద్దరూ దుకాణానికి సమీపంలోని ఇమాం పంజావీధిలో అద్దెకు ఉంటున్నారు. ముఖేష్‌కుమార్ అత్యవసర పనిమీద ఆగ్రా వెళ్తూ తన వద్ద ఉన్న బంగారు ఉంగరాలు, ముక్కుపుడకలు, ఇతర బంగారు ముద్ద సుమారు 130 గ్రాములు ఉన్న వస్తువులను తన గుమాస్తాలు ఉంటున్న ఇంటిలో ఉంచమని చెప్పి ఈ నెల ఐదో తేదీన ఊరెళ్లాడు. ఏడో తేదీన గుమస్తాలు తనకు ఫోన్ చేసి ఆరో తేదీన ఇంటికి తాళం వేసి గుంటూరు లైన్‌కు వెళ్లామని, అదే రోజు రాత్రి ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం పగలగొట్టి ఉందని చెప్పారు. ఇంట్లో ఉండాల్సిన బంగారు వస్తువుల బాక్స్ కనపడటం లేదని ఫోన్ ద్వారా సమాచారమందించారు. దాంతో ముఖేష్‌కుమార్ ఈ నెల 13వ తేదీన నగరానికి వచ్చి దానిపై వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మైనర్‌కు ప్రేమ పేరిట వేధింపులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మైనర్‌కు ప్రేమ పేరిట వేధింపులకు గురి చేస్తున్న యువకుడిపై కొత్తపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిట్టినగర్ సాధు హోటల్ సమీపంలో ఓ వివాహిత తన ఇద్దరు పిల్లలతో నివాసం ఉంటోంది. ఆమె భర్తతో విభేదాల కారణంగా వేరుగా ఉంటుంది. ఆమె గతంలో వైఎస్సార్ కాలనీలో నివాసం ఉండేది. ఆ సమయంలో వేణు అనే యువకుడు వివాహిత కుమార్తె(17) వెంట పడి ప్రేమ పేరిట వేధింపులకు గురి చేసేవాడు. ఈ విషయం వేణు కుటుంబ సభ్యులకు చెప్పి మందలించారు. బుధవారం సాయంత్రం వేణు బాలిక ఇంటికి వచ్చి వేధింపులకు గురి చేశాడు. ఇంతలో బాలిక తల్లి రావడంతో జరిగిన విషయాన్ని చెప్పింది. ఘటనపై బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.